31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
శనివారం,అక్టోబర్ 24 , 2026 పేజీలు : 8

# రాష్ట్రంలో బెల్ట్ షాపులను అరికట్టాలి

- ఎల్ నినో కరువులో బెల్ట్ షాపులతో పేదల నడ్డివిరుస్తున్నారు
- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 23:** రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రత్యేక కరువు పరిస్థితుల్లో అనధికార మద్యం విక్రయ కేంద్రాలైన బెల్ట్ షాపులను అరికట్టాలని కోరుతూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి శుక్రవారం సీ ఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గ్రామీణ రైతాంగం, రైతు కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలిశాయని, ఒక్క జగిత్యాల జిల్లాలోనే 1000 పైగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని, దీంతో సామాన్య ప్రజలు మద్యానికి బానిసలుగా మారి అప్పుల ఊబిలో కూరుకుపో తున్నారు, అనారోగ్యాలు, ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. వైద్య ఖర్చులతో కుటుంబాలు మరింత చితికిపోతున్నాయి. -మిగతా 2లో

# ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలి

- జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలి
- ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఉపాధి పనుల విస్తరణకు చర్యలు తీసుకోవాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి.
- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 23:** ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలని, జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలని, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఉపాధి పనుల విస్తరణకు చర్యలు తీసుకోవాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వీబీ జి రాం జి, ఉపాధి హామీ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం , తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, జల సంరక్షణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న కాలంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలని సూచించారు. ప్రస్తుతం రోజువారీ సగటున 60 మందికి ఉపాధి కల్పిస్తున్న నేపథ్యంలో, ప్రతి గ్రామంలో సగటున 45 మంది కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకొని, ఆ సంఖ్యను స్థిరంగా కొనసాగించాలని ఆదేశించారు. కాలు వల్లో పూడికతీత వంటి సామూహిక పనులను విస్తృతంగా చేపట్టాలని, పనుల షెల్ఫ్‌ను 200 శాతానికి పెంచాలని సూచించారు. సెప్టెంబర్ నెలకు నిర్దేశించిన మూడు లక్షల లక్ష్యంలో ఇప్పటివరకు రెండు లక్షల మేర పురోగతి సాధించినందున, మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

**ఫార్మ్ పాండ్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి...**

జిల్లాలో ఫార్మ్ పాండ్ల నిర్మాణానికి సంబంధించి 1,250 లక్ష్యానికి గాను 1,256 మంజూరు చేయగా, ఇప్పటివరకు 828 పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన పనులకు సంబంధించి మంజూరు, నిర్మాణ ప్రక్రియను సమన్వయంతో చేపట్టి రానున్న రెండు నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.

**జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి...**

గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే మ్యాజిక్ సోక్‌పిట్స్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్స్ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ పనులకు సంబంధించి సోమవారం లోగా మంజూరుల ప్రక్రియను పూర్తి చేయాలని, అక్టోబర్ 31 నాటికి మ్యాజిక్ సోక్‌పిట్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనలో ఎంపీవోలు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలకు సంబంధించి జిల్లాలో 177 లక్ష్యానికి గాను 118 పనులకు మంజూరు లభించిందని అధికారులు తెలిపారు. మిగిలిన పనుల పురోగతిని సమీక్షిస్తూ, తాగునీటి వనరుల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరులు వెంటనే పూర్తి చేయాలి.**

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కింద మిగిలి ఉన్న 918 మంజూరులను డీఆర్‌డీఏ, హౌసింగ్ అధికారులు సమన్వయంతో వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అర్హులైన లబ్ధిదారులకు మరుగుదొడ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా చర్యలు..**

ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత నిర్మాణ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, మొత్తం 11,654 ఇళ్ల లక్ష్యానికి సంబంధించి 10,901 ఇళ్లకు ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు తెలిపారు. -మిగతా 2లో

# మెట్‌పల్లి బస్టాండ్ సమస్యలకు త్వరలోనే పరిష్కారం

- ప్రయాణికుల ఇబ్బందులపై ఎమ్మెల్యే సంజయ్ ఆరా
- ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యం..



**చురకలు విలేకరి, మెట్ పల్లి, అక్టోబర్ 23:** మెట్ పల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలోనే పూర్తి పరిష్కారం చూపిస్తామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ వెల్లడించారు. బస్టాండ్ ప్లాట్‌ఫారమ్‌ను విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా బస్టాండ్ ఇన్‌గేట్, ఔట్‌గేట్ వద్ద నెలకొంటున్న ప్రమాదకర పరిస్థితులపై దృష్టి సారించిన ఎమ్మెల్యే.. డిపో మేనేజర్ హరిని సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌కు నిత్యం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బస్సుల రాకపోకలు, ఇన్‌గేట్, ఔట్‌గేట్ వద్ద ప్రయాణికుల భద్రతకు సంబంధించిన సమస్యలను పరిశీలించి,వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు ప్లాట్‌ఫారమ్ విస్తరణ ద్వారా రద్దీని తగ్గించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని,సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ బస్టాండ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్లాట్‌ఫారమ్ విస్తరణతో పాటు గేట్ల వద్ద ప్రమాదాల నివారణకు చేపట్టే చర్యలు త్వరగా కార్యరూపం దాల్చాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ హరి, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌ను
# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- మత్తు పదార్థాల సరఫరాపై ఉక్కుపాదం.. విద్యాసంస్థలు, మెడికల్ షాపులు, బస్టాండ్ల వద్ద నిఘాలి
- గంజాయి చాక్లెట్ల విక్రయంపై కఠిన చర్యలు.. విద్యార్థులు, యువతను అప్రమత్తం చేయాలి
- కలెక్టర్ చిత్రా మిశ్రా




**చురకలు ప్రతినిధి కరీంనగర్ :** విద్యార్థులు, యువత భవిష్యత్తును మత్తు పదార్థాలు ఛిద్రం చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిరంతర నిఘా, విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలతో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, వినియోగంపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసులు, నిర్వహించిన తనిఖీలు,

-మిగతా 2లో

## పోరండ్ల ప్యాక్స్ పాలకవర్గ సమావేశం



**చురకలు విలేకరి తిమ్మాపూర్ అక్టోబర్ 23 :** తిమ్మాపూర్ మండల పరిధిలోని  పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సమావేశం చైర్మన్ గోపు తిరుపతి రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో రైతులకు పంట రుణాల మంజూరు,రుణాల పంపిణీ ప్రక్రియ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ప్రస్తుత పంట కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. రైతులకు అవసరమైన సహకారం అందించడం,పంట రుణాల విషయంలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం,సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడం వంటి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో చర్చించిన అజెండా అంశాలను పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.సమావేశంలో  వైస్ చైర్మన్ రావుల కృష్ణ, పాలకవర్గ సభ్యులు బొజ్జ పర్శరాములు,యాళ్ళ రమ, బిజిలి కొమురయ్య, సింగిరెడ్డి నర్సింహారెడ్డి, జేజేల కనకమ్మ,పార్నంది దుర్గయ్య, పైడిపెల్లి స్వామి, మదన అంజయ్య, పెండ్యాల కొండల్ రెడ్డి, జాప లక్ష్మి, ఐతం వెంకన్న, సొసైటీ సీఈఓ మాదన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోతరాజు వెంకటమ్మ మృతికి జర్నలిస్టుల నివాళి



**చురకలు ప్రతినిధి మంథని, అక్టోబర్ 23 :** ఇటీవల అనారోగ్య కారణాల వల్ల మృతి చెందిన ఆంధ్రజ్యోతి మంథని ఆర్సీ ఇంచార్జ్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎథిక్స్ కమిటీ చైర్మన్ పోతరాజు సమ్మయ్య మాతృమూర్తి పోతరాజు వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శుక్రవారం టీయూడబ్ల్యూజే నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. వెంకటమ్మ ఆత్మ శాంతించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సీనియార్టీ సమస్యలు పరిష్కరించాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** విద్యుత్ శాఖలోని ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సీనియార్టీ మరియు పదోన్నతి హక్కులను పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు కమాన్ పూర్ ఎస్సీ ఎస్టీ యూనియన్ మరియు మందకృష్ణ మాదిగ, ఆరేపల్లి మోహన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మెరిట్ కం సీనియార్టీ సమస్యలపై వెంటనే పరిష్కరించాలని చాలా కాలంగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అవినీతిపత్రంలో పేర్కొన్నారు. మెరిట్ కం సీనియార్టీ విధానం అమలు వల్ల విద్యుత్ శాఖలోని ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సీనియార్టీ మరియు పదోన్నతి ప్రయోజనాలు తీవ్రంగా ప్రభావితమాగుతున్నాయని మంత్రికి వివరించారు ప్రభుత్వ ఉత్తర్వు లేదా సాధారణ పరిపాలన శాఖ మార్గదర్శకాలోనూ ఆధారం లేదని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి టిజిఎన్పిడిసిఎల్ సిఎండితో మాట్లాడారు. త్వరలోనే విద్యుత్ సంస్థలన్నీటి సీఎండీలు ఇంధ్ర శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సాధారణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తో సమావేశం ఏర్పాటు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ కి చెందిన కార్యవర్గ సభ్యులు ఆరేపల్లి శ్రీనివాస్ కే ఉపేందర్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా 202/2010 ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య నాయకత్వంలో వినతి పత్రం అందజేశారు.

# అనుమతులు లేకుండా ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు

**-ప్రియాంక క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్**



**చురకలు హుజూరాబాద్ అక్టోబర్ 23 :** ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు పొందకుండా, వైద్యపరమైన అర్హతలు లేకుండా ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన హుజురాబాద్ పట్టణంలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రోడ్డులో ఉన్న ప్రియాంక క్లినిక్‌ను డాక్టర్ ప్రభుదాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవసరమైన అర్హతలు, అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో, క్లినిక్ నిర్వహించరాదని సంబంధిత డాక్టర్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ప్రతి ప్రైవేట్ క్లినిక్ నిర్వాహకుడు సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన వారు వెంటనే రెన్యువల్ చేసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని క్లినిక్‌లపై జరిమానాలు విధించడంతోపాటు అవసరమైతే సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా ప్రైవేట్ క్లినిక్‌లు ప్రారంభించాలనుకునే వారు వైద్యుల విద్యార్హత ధ్రువపత్రాలు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. క్లినిక్‌లలో పనిచేసే పారామెడికల్ సిబ్బంది కూడా తెలంగాణ పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ పొందిన వారై ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పాటించడంతోపాటు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అనుమతులు, జిల్లా అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) సమర్పించాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి క్లినిక్ నిర్వాహకుడు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జారీ చేసే ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలని డాక్టర్ ప్రభుదాస్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జిల్లా ఆరోగ్య బోధకులు పంజాల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**మొదటి పేజీ తరువాయి...** మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు.

**యువత భవిష్యత్తుకు మత్తు పదార్థాలు ముప్పు**

డ్రగ్స్‌కు అలవాటుపడితే ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా ఆలోచనా శక్తి క్షీణించి, వ్యక్తిగత జీవితం, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాల ఆకర్షణకు లోనుకాకుండా విద్యాసంస్థల స్థాయి నుంచే నిరంతర అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరించాలన్నారు. విద్యార్థుల్లో చైతన్యం పెంచేందుకు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు సమావేశంలో వివరించారు.

**సరఫరాదారులపై నిరంతర నిఘా**

డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులు, విక్రయదారులు, వినియోగదారులను గుర్తించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యాసంస్థలు, మెడికల్ షాపులు, బస్టాండ్ల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి మత్తు పదార్థాలు చేరకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**చాక్లెట్ల రూపంలో గంజాయి.. అప్రమత్తంగా ఉండాలి**

సాధారణ చాక్లెట్ల ముసుగులో గంజాయి చాక్లెట్లను విక్రయించే ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద బీహార్ కార్మికులకు అందించేందుకు తీసుకొచ్చిన 168 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని వివరించారు. ఈ కేసు వివరాలను కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు తెలియజేశారు.చాక్లెట్ల పేరుతో గంజాయి విక్రయించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. పిల్లలు, యువతకు తెలియకుండా ఇలాంటి మత్తు పదార్థాలు చేరే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల విక్రయాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని అధికారులు కోరారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి, వారిని నేరస్థులుగా చూడకుండా అవసరమైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ అడిక్షన్ సెంటర్లు, పునరావాస కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడంతో పాటు, ఇప్పటికే వాటికి బానిసైన వారు సాధారణ జీవనంలోకి తిరిగి వచ్చేలా సహకరించాలని సూచించారు.డ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యాన్ని సాధించేందుకు పోలీసు, ఎక్సైజ్, విద్యా, వైద్య ఆరోగ్యశాఖలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేసి, మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

# ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలి

**మొదటి పేజీ తరువాయి...**మొదటి విడతలో మిగిలి ఉన్న 860 ఇళ్ల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రెండో విడతలో 4,953 కొత్త ఇళ్లు, 1,772 పైకప్పుల మార్పిడి పనులు కలిపి మొత్తం 6,725 ఇళ్లకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించాలని తెలిపారు. సంబంధిత శాసనసభ్యుల ప్రతిపాదనలు, గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణ అనంతరం నిబంధనల ప్రకారం మంజూరు ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఉపాధి కల్పన, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, జల సంరక్షణ, పారిశుద్ధ్యం, పేదలకు గృహ వసతి కల్పన వంటి అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, డిప్యూటీ సీఈఓ పి. నరేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, హౌసింగ్ పీడీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి , ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో బెల్ట్...

**మొదటి పేజీ తరువాయి...**2023-24లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటికి ఎక్సైజ్, అబ్కారీ ఆదా యం దాదాపు 30 వేల కోట్లు ఉండగా, మూడు సంవత్సరాలలో 45 వేల కోట్లకు చేరడం సమాజం మద్యానికి ఎంతలా బానిసగా మారిందో తెలుపుతోంద న్నారు.అధికారిక మద్యం దుకాణాలకు నిర్ణీత వేళలుంటే, అనధికార బెల్ట్ షాపులు ఎలాంటి ఆంక్షలు లేకుండా 24 గంటలు ఆన్ లైన్ విక్రయం, డోర్ డెలివరీ చేస్తున్నాయని, ఎక్సైజ్, పోలీస్ శాఖలు అదుపు చేయకపోగా ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందని ఆరోపించారు. ప్రస్తుత ఎల్ నినో కరువులో తాగు, సాగు నీటికి ఇబ్బందులు, నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో సామాన్య కుటుంబాలు అప్పుల్లో కూ రుకుపోతున్నాయన్నారు.ప్రభుత్వం మద్యం విక్రయాలను ఆదా యంగా పరిగణించకుండా, ప్రజా ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థను కాపాడటంలో భాగంగా అనధికార బెల్ట్ షాపుల ద్వారా అమ్మకాలను పూర్తిగా అరికట్టేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

## నూకపల్లి డంపింగ్ యార్డ్‌పై కాలనీవాసుల ఆందోళన



**చురకలు ప్రతినిధి, జగిత్యాల,అక్టోబర్ 23 :** జగిత్యాల జిల్లా నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డ్ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. మున్సిపల్ సిబ్బంది చెత్తను ఇక్కడే వేసి కాల్చడంతో పొగ, దుర్వాసనతో పరిసరాలు కమ్మేస్తున్నాయని, చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు ఆసుపత్రి పాలయ్యారని తెలిపారు.ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం మున్సిపల్ చెత్త వాహనాలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్ ను వెంటనే తొలగించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## డీఎస్పీ రాములును మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీకాంత్



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (23) :** జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా బైండ్ల శ్రీకాంత్ ఎన్నికైన సందర్భంగా శుక్రవారం మెట్‌పల్లి డీఎస్పీ రాములును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాములుతో సమావేశమై పరస్పరం మాట్లాడుకున్నారు. డి ఎస్ పి ని శాలువాతో సన్మానించి పుష్కరించడం అందజేశారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో బైండ్ల శ్రీకాంత్ డీఎస్పీని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మర్యాదపూర్వక భేటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పరామర్శ



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 23 :** జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నలువాల నరేష్ గాయపడి జగిత్యాల పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారనే విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. నరేష్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. వైద్య ఖర్చుల నిమిత్తం నరేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, నరేష్ గౌడ్, సర్పంచ్ స్వామిరెడ్డి, మహేష్, శ్రీరాముల గంగాధర్, కొక్కుల గంగాధర్, కాటిపల్లి రాజశేఖర్ రెడ్డి, వంశీ, దరి, చంద్రయ్య, రాజశేఖర్, గణేష్, సుమన్ తదితరులున్నారు.

# ఎర్ధండి పుష్కర ఘాట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్

### - సదర్‌మాట్ బ్యారేజ్ బ్యాక్‌వాటర్‌తో ఎర్ధండి నుంచి గుమ్మిర్యాల వరకు గోదావరిలో నీరు



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (23) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్ధండి పుష్కర ఘాట్‌ను కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి నది పరిసర ప్రాంతాలను, పుష్కర ఘాట్ వద్ద ఉన్న పరిస్థితులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మూలరాంపూర్ వద్ద గోదావరి నదిపై ఒక టీఎంసీ సామర్థ్యంతో నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజ్ బ్యాక్‌వాటర్ కారణంగా ప్రస్తుతం ఎర్ధండి నుంచి గుమ్మిర్యాల వరకు గోదావరిలో నీరు నిల్వ ఉందని తెలిపారు. బ్యారేజ్ బ్యాక్‌వాటర్ వల్ల నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి లభ్యత, దాని వినియోగం వంటి అంశాలపై ఆయన ప్రస్తావించారు.అనంతరం పుష్కర ఘాట్ వద్ద ఉన్న సౌకర్యాలు, పరిసర ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. భవిష్యత్తులో పుష్కర ఘాట్ అభివృద్ధికి సంబంధించిన అంశాలు, గోదావరి జలాల వినియోగం, నదీ పరిసర ప్రాంతాల ప్రాధాన్యతపై చర్చించారు. గోదావరి నది తీర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు మరియు పుష్కరాల సమయంలో వచ్చే యాత్రికులకు అవసరమైన సౌకర్యాలపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# తెజసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డికి సన్మానం

### -పేదలు,బలహీన వర్గాల అభ్యున్నతే జనసమితి లక్ష్యం: కంతి మోహన్ రెడ్డి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (23) :** తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కంతి మోహన్ రెడ్డికి శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని కొత్త బస్‌స్టాండ్ ప్రాంతంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సన్మానం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆయనను ఈ పదవిలో నియమించడం తో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కంతి మోహన్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ,పేదలు, రైతులు, బలహీన వర్గాల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం తెలంగాణ జనసమితి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత అంకితభావంతో పనిచేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జిల్లపెల్లి దిలీప్ కుమార్, మండల అధ్యక్షుడు కంతి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఏశాల గంగా రెడ్డితో పాటు రెబ్బటి మల్లయ్య యాదవ్, నందగోపాల్, గజ్జ రాజేందర్, కనుక కృష్ణ, గూడా రాజారెడ్డి, కాట దశరథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సభలు



**కరీంనగర్, అక్టోబర్, 23 :** ఆళ్వారు దివ్య ప్రబంధప్రాజెక్ట్ తిరుమలతిరుపతిదేవస్థానములు మరియు శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్, ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాసపత్రిక సంయుక్త నిర్వహణలో పూదత్తాళ్ వార్, పేయాళ్వార్ తిరునక్షత్ర మహోత్సవ విద్వత్ సభ జరిగింది స్థానిక సప్తగిరి కాలనీ రామాలయంలో రెండురోజులుగా జరిగిన ఈ సభలకు ఖమ్మం హైదరాబాద్ వరంగల్ నుండి ప్రవచన కారులు హాజరు అయ్యారని నిర్వాహకులు తెలిపారు.22 వ తేదీ చక్రవర్తుల చూడామణి,అమరవాది వెంకట నర్సింహాచార్యులు, సముద్రాల శఠకోపాచార్యులు 23 వ తేది కండ్ల కుంట వెంకట నర్సింహా చార్యులు, కందాలై లక్ష్మణ మూర్తి,కల కుంట్ల వరప్రసాదాచార్యులు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి జనగామ,నంబి వేణు గోపాలాచార్య కౌశిక జగిత్యాల, మరియు స్థానిక పండితులు భక్తులు, పత్రిక,ట్రస్ట్ వ్యవస్థాపకులు, సంపాదకులు డింగరి శ్రీనివాస మూర్తి, శాంత, సముద్రాల శారద పాల్గొన్నారు.

## ఘనంగా రమేష్‌రావు వర్ధంతి వేడుకలు



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 23 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో దివంగత నాయకుడు కల్వకుంట్ల రమేష్ రావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం గ్రామ సర్పంచ్ బండమీది కవిత, గోపి ఆధ్వర్యంలో వెల్గటూర్ మండల నాయకులు , ప్రజా ప్రతినిధులు , యువజన సంఘాలు, గ్రామస్థులు రమేష్ రావు గ్రామానికి చేసిన సేవలను కొనియాడుతూ కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులు అర్పించారు.సింగిల్ విండో చైర్మన్ గా, రమేష్ రావు, సర్పంచ్ గా ఆయన సతీమణిని గెలిపించుకొని గ్రామాభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవచేసిన నాయకుడని పేర్కొన్నారు. ఆయన మరణించి 19 ఏళ్ళు గడిచినా గ్రామ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.ఈ కార్యక్ర మంలో వెల్గటూర్ ప్రజలు, అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.



## జై భవాని లక్కీడ్రా మోసం కేసులో ఒకరి అరెస్టు




**చురకలు ప్రతినిధి, జగిత్యాల,అక్టోబర్ 23 :** జగిత్యాల పట్టణంలో జై భవాని లక్కీ డ్రా పేరుతో జరిగిన మోసం కేసులో ఒకరిని టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సాయిరాం నగర్ కు చెందిన చింతల రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అష్టలక్ష్మి దేవాలయం వద్ద ఎలక్ట్రిక్ బైక్, గోల్డ్ తదితర 8 బహుమతులు ఇస్తామని చెప్పి కూపన్ కు 100 రూపాయల చొప్పున దాదాపు 7 వేల కూపన్లు విక్రయించారు. అక్టోబర్ 21న దసరా రోజు డ్రా తీస్తామని చెప్పి నిర్వాహకులు బోడ లక్ష్మీ నరసయ్య, మానపురి కిరణ్ ఎవరికీ తెలియకుండా డ్రా తీసినట్లు ఫిర్యాదు అందినదని తెలిపారు. ఈ ఫిర్యాదుపై టౌన్ ఎస్ఐ ఎం.సుప్రియ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా శుక్రవారం సాయిరాం నగర్ లో నిందితుడు బోడ లక్ష్మీ నరసయ్యను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు, ప్రజలను మోసం చేసే ఉద్దేశంతో కొన్ని కూపన్లపై తమ పేర్లే రాసుకుని ఎవరూ లేకముందే డ్రా తీశామని తెలిపాడు. నిర్వాహకుడి వద్ద నుంచి 2 ఎలక్ట్రిక్ వెహికల్స్, 3 సైకిళ్లు, తమ పేర్లు రాసుకున్న 5,150 కూపన్ రసీదు స్లిప్పులను స్వాధీనం చేసుకున్నామని, బోడ లక్ష్మీ నరసయ్యను అరెస్ట్ చేశామని, రెండవ నిందితుడు పరారీలో ఉన్నాడని టౌన్ ఇన్స్పెక్టర్ పి.కరుణాకర్ తెలిపారు.

## నిలిచిపోయిన 8 నెలల వేతనాలు అందించి ఆదుకోండి



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 23 :** సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలమగ్గిడిలో2025,26 విద్యాసంవత్సరంలో పార్ట్ టైం ఉపాధ్యాయునిగా పనిచేసిన తనకు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ లో సాంకేతిక కారణాల వల్ల 8 నెలల వేతనాలు నిలిచిపోయి ఇప్పటికి రావడంలేదని పార్ట్ టైం టీచర్ మ్యాకల విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత ఉన్నత కార్యాలయంకు ఎన్ని సార్లు వెళ్లినా ఏవేవో సాకులు చెబుతున్నారని,సంవత్సరం గడిచినా సమస్యపరిష్కరించి వేతనాలు అందించడంలేదని, ఇలా రాష్ట్రం మొత్తంలో 140 మంది పార్ట్ టైం టీచర్లు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రాష్ట్ర సంబంధిత మంత్రి స్పందించి వెంటనే సమస్య పరిష్కరించి వేతనాలు అందేల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## టిఎస్ సీపీఎస్ఈయు నూతన కార్యవర్గం ఎన్నిక





**చురకలు విలేకరి,కొడిమ్యాల,అక్టోబర్ 23 :** తెలంగాణ స్టేట్ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ కొడిమ్యాల మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎన్నికల పరిశీలకులు మారపల్లి శ్రావణి సమక్షంలో ఎన్నిక జరిగాయి. అధ్యక్షురాలిగా గోలి స్వప్న, ప్రధాన కార్యదర్శిగా కుంభం మహేష్, ఉపాధ్యక్షులుగా శ్రీపతి పల్లవి, సహాయ కార్యదర్శులుగా గంగాధర మహేష్, కార్యనిర్వహణ కార్యదర్శిగా అరువ గీత, కోశాధికారిగా సాక సుమలత ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతామని, మండలంలో సీపీఎస్ ఉద్యోగులను ఏకం చేసి సంఘ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# సాగు భూముల సంరక్షణపై రైతులకు అవగాహన

**-యాసంగిలో వరికి బదులు అపరాల సాగుకు మొగ్గు చూపాలి : వ్యవసాయ అధికారి నాగమణి**





**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 23 :** కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం సాగు భూముల సంరక్షణలో భాగంగా ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ భూమి సారాన్ని కాపాడుకునే విధానాలను రైతులకు వివరించారు. యాసంగిలో వరి పంటకు అవసరమైన నీరు సరిపడా అందుబాటులో ఉండకపోవచ్చని, అందువల్ల వరికి బదులుగా అపరాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పెసలు, మినుముల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఉద్యాన అధికారి కట్ట లత మాట్లాడుతూ పంట మార్పిడిలో భాగంగా రైతులు ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని, మండలంలో గతంలో నాటిన తోటల్లో దిగుబడులు ప్రారంభమయ్యాయని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం పంట కొనుగోలు జరుగుతోందని, గెలలు విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని వివరించారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపి అధిక ఆదాయం పొందాలని ఆకాంక్షించారు.

# నూకపల్లి డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి

**-మున్సిపల్ కమిషనర్ కు మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఫోన్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 23 :** నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీ డంపింగ్ యార్డ్ సమస్యపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ తో ఫోన్ లో మాట్లాడారు.కమిషనర్ తో ఫోన్ లో మాట్లాడుతూ నిన్నటి నుండి డంపింగ్ యార్డ్ లో విపరీతంగా మంటలు ఎగిసిపడడంతో కాలనీ వాసులు అక్కడ ఉండే పరిస్థితి లేదన్నారు. 4 నుండి 5 గురు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారని తెలిపారు. పొడి, తడి చెత్త వేరు చేసి రీసైక్లింగ్ చేయడానికి సిస్టం ఉందని, మరి జగిత్యాలలో ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కాలనీలో 4 వేల కుటుంబాలు, 10 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారని, వారి హెల్త్ పట్ల బాధ్యత తీసుకోవాలన్నారు. రెవెన్యూ మంత్రి కాలనీకి వచ్చిన తర్వాతైనా మున్సిపల్ బాధ్యత మెరుగుపడాలని, ఫైర్ యాక్సిడెంటా లేక ఎవరైనా తగులబెట్టారా అని కాకుండా అక్కడికి ఫైర్ ఇంజన్ ఎందుకు రావడం లేదని నిలదీశారు. నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ కు రెస్పాన్సిబుల్ పర్సన్ లేరని, కాలనీలో ఎప్పుడూ ఒక శానిటేషన్ వర్కర్ ఉండాలని సూచించారు. ఇప్పటికే డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ ఇబ్బందులుంటే, దానికి తోడు డంపింగ్ యార్డ్ మరో సమస్యగా మారిందని, సమస్యను తొందరగా పరిష్కరించకుంటే ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని హెచ్చరించారు.

# అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**- ఆదివారం 20 కి.మీ సైకిల్ ర్యాలీ**

**-పోస్టర్, రూట్ మ్యాప్‌లను ఆవిష్కరించిన సీపీ గౌష్ ఆలం**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల అక్టోబర్ 25వ తేదీ ఆదివారం రోజున నిర్వహించబోయే సైకిల్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్ మరియు రూట్ మ్యాప్‌లను కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం ఈ సైకిల్ ర్యాలీ పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమవుతుందని సీపీ తెలిపారు. పరేడ్ గ్రౌండ్ నుండి మొదలై బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగి, ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకుంటుంది. అనంతరం కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగుస్తుందని ఆయన వివరించారు. ఈ సైక్లింగ్ ర్యాలీ నగరంలో దాదాపు 20 కిలోమీటర్ల మేర జరగనుందని సీపీ పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమీషనర్ తెలిపారు. ఈ పోలీస్ అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ పోటీలలో మరియు కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం కోరారు.

# అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

### -విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన.. ఎస్పీ మహేష్ బి. గితే



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 23 :** పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థినీ, విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..విధి నిర్వహణలో ప్రజల రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. పోలీస్‌శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు,శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర,పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

**పోలీస్ విధులపై ప్రత్యక్ష అవగాహన...**

ఓపెన్ హౌస్‌లో భాగంగా పోలీస్ శాఖకు చెందిన వివిధ విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు వివరించారు. పోలీసులు నిర్వహించే పగలు, రాత్రి గస్తీ,పెట్రోలింగ్,ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, బాధితులకు న్యాయం అందించేందుకు తీసుకునే చర్యలను వివరించారు. నేరస్తులను గుర్తించేందుకు వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరాల పనితీరును ప్రదర్శించారు. నేరాల నివారణతోపాటు, నేరాలను త్వరగా ఛేదించడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేశారు.మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను వివరించారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించడం, బ్లాక్ చేయడం,తిరిగి పొందడంలో సీఈఐఆర్ వ్యవస్థ ఉపయోగాలను తెలియజేశారు.బాంబ్ స్క్వాడ్ విధులు, పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేసే విధానం, పోలీస్ జాగిలాల సేవలపై అవగాహన కల్పించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి...**

విద్యార్థులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని,హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్,ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు.ఆన్‌లైన్‌లో అపరిచితుల తో పరిచయాల విషయంలో అప్రమత్తం గా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్,భరోసా కేంద్రం,షీ టీమ్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ స్క్వాడ్, కమ్యూనికేషన్ విభాగాల సిబ్బంది పాల్గొని పోలీస్ శాఖ విధులు, ప్రజల రక్షణ కోసం చేపడుతున్న చర్యలను విద్యార్థులకు వివరించారు.కార్యక్రమం లో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గణేష్, అనిల్, రంజిత్, ఆర్ఎస్ఐ సాయికిరణ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాంలీలా కార్యక్రమంలో

# నాణ్యత లోపం అంటూ ప్రచారం హాస్యాస్పదం

### -దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు బుర్ర నటరాజ్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్, అక్టోబర్ 23 :** దసరా పండుగ సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాంలీలా కార్యక్రమంలో బాణసంచా విషయంలో నాణ్యత లోపం ఉందంటూ కొందరు చేస్తున్న విమర్శలు పూర్తిగా హాస్యాస్పదమని రామ్ లీలా దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు బుర్ర నటరాజ్ కొట్టిపారేశారు. అవగాహన లోపంతోనే కొంతమంది అనవసరమైన దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన మండిపడ్డారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాంలీలా కార్యక్రమాన్ని ప్రజలందరూ ఎంతో ఉత్సాహంగా వీక్షించారని తెలిపారు. రావణ దహన కార్యక్రమం సంపూర్ణంగా జరిగిందని, ఎక్కడా ఎలాంటి నాణ్యత లోపం లేదని స్పష్టం చేశారు. నేడు సోషల్ మీడియాలో కూడా ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఈ రావణ దహన విజువల్స్‌ను షేర్ చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారే తప్ప, ఎవరూ విమర్శించడం లేదని.. ఈ ఒక్క విషయాన్ని గమనిస్తేనే విమర్శకులకు సమాధానం దొరుకుతుందని హితవు పలికారు.భద్రత కోసమే జోన్‌లోకి పాత్రికేయులను, పాలకవర్గాన్ని, అధికారులను బ్లాస్టింగ్ జోన్ లోకి రానివ్వలేదనడం అర్థం లేని ఆరోపణ అని బుర్ర నటరాజ్ స్పష్టం చేశారు. బాణసంచా పేల్చే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ముందస్తు సమాచారంతో అధికారుల ఆదేశాల మేరకే భద్రతా కారణాల దృష్ట్యా బ్లాస్టింగ్ జోన్ ను పూర్తిగా మూసివేసినట్లు వివరించారు. కార్యక్రమం ముగిసే చివరి పది నిమిషాల సమయంలో పాత్రికేయులను, పాలకవర్గాన్ని, అధికారులను లోపలికి స్వాగతించామని చెప్పారు. కనీస బాధ్యత తెలీకుండా, వాస్తవాలను అర్థం చేసుకోకుండా అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో విజయవంతంగా జరిగిన కార్యక్రమంపై కావాలనే దుష్ప్రచారం చేస్తూ, వార్తల్లో నిలవాలనే కుటిల ఆలోచనతోనే కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వారి ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని రాంలీలా నిర్వహణ బాధ్యునిగా ఆయన అధికారిక వివరణ ఇచ్చారు.

# పదిరలో రజక, యాదవ సంఘాలకు రూ.4 లక్షల నిధులు

### -బండి సంజయ్ కుమార్ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 23 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో రజక, యాదవ సంఘాల అభివృద్ధికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిధుల నుంచి రూ. 4లక్షలు మంజూరయ్యాయి. ఇందులో రజక సంఘానికి రూ. 2 లక్షలు,యాదవ సంఘానికి రూ. 2 లక్షలు కేటాయించారు.ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి శుక్రవారం పూజా కార్యక్రమం నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామంలోని ఆయా సంఘాల అభివృద్ధికి నిధులు మంజూరు కావడంపై సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ నిధులతో సంఘాలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి,గ్రామ సర్పంచ్ బోనాల మణెమ్మ,ఉపసర్పంచ్ గోపన్నగారి కొమురయ్య, జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి, సీనియర్ నాయకులు సత్యం రెడ్డి, పరిశరాం రెడ్డి, ఎలేందర్‌తో పాటు యాదవ సంఘం సభ్యులు వట్టెల ఎల్లయ్య, చెరుకు బాలయ్య, చెరుకు ఎల్లయ్య, రజక సంఘం అధ్యక్షుడు కంచర్ల రాజు, పరశురాములు, సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకునే ఆపద్భాంధవుడు...

### -మంథని ప్రజల గుండెల్లో శీను బాబు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 (జబ్బార్ ఖాన్) :** అధికారం అంటే హోదా కాదు,బాధ్యత అని నిరూపిస్తున్నారు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిళ్ల శీను బాబు.ఎవరికైనా ఆపద వచ్చిందంటే చాలు,క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తరలించి, వారికి అండగా నిలబడటమే తన ముందు కర్తవ్యంగా పెట్టుకున్నారు.మంథని నియోజకవర్గం లోని కమాన్ పూర్, ముత్తారం మహా ముత్తారం, పాలకుర్తి, రామగిరి, కాటారం, మహదేపూర్, పలిమెల, మండలాల ప్రజలకుఆయన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. అర్ధరాత్రి ఫోన్ చేసినా సరే, ఫోన్ లోనే ఉంటూ సహాయం కోసం చేసేందుకు నేనున్నాను అంటూ పరుగులు పెడుతుంటారు. పేదవాడికి వైద్యం అందక ఇబ్బంది పడుతున్నాడని తెలిస్తే, సొంత మనిషిలా ఆసుపత్రికి తీసుకెళ్లి చేర్పించడం ఆయన దినచర్యలో భాగమైపోయింది.అన్న శ్రీధర్ బాబు మంత్రిగా రాష్ట్రాభివృద్ధిలో తలమునకలై ఉంటే, తమ్ముడు నియోజకవర్గంలో ప్రజా సేవలో తరించడం విశేషం. రాజకీయం అంటే ఓట్ల కోసం కాదు, సేవ కోసమే అని ఆచరణలో చూపిస్తున్నారు. అందుకే మంథని ప్రజలు ఆయనను తమ ఇంటి బిడ్డలా చూసుకుంటున్నారు. ఆయన నియోజకవర్గానికి వచ్చిందంటే చాలు యువతరం కదలి ఆయన వెంట ఉండడమే చేస్తారు. ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంటాడు. వృద్ధులు కనిపిస్తే చాలు ఆలింగనం చేసుకొని బాగోగులు తెలుసుకోవడమే శీను బాబు నైజం.ఆపదలో ఆదుకునే సీను బాబును మంథని ప్రజలు ఆరాధ్యంగా కొలుస్తుంటారు.

# పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 23 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగాలి ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన 'ఓపెన్ హౌస్'కార్యక్రమానికి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేట జడ్పీహెచ్ ఎస్ విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, శాంతిభద్రతల పరిరక్షణ మరియు పోలీస్ విధులపై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సిఎం వెంకటేష్ విద్యార్థులకు సాదర స్వాగతం పలికి పోలీస్ స్టేషన్ పనితీరును స్వయంగా వివరించారు.స్టేషన్ రికార్డులు విభాగాలు ఫిర్యాదు నమోదు విధానం, జీడీ ఎంట్రీ, ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ, లాకప్ గది, రిసెప్షన్ కౌంటర్ల పనితీరును చూపించారు.ఆయుధాలు సాంకేతిక పరికరాలు: పోలీసులు శాంతిభద్రతల నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, వాకీటాకీలు,కమ్యూనికేషన్ వ్యవస్థల గురించి విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.

**డైల్ 100 & షీ టీమ్స్:**

ఆపద సమయాల్లో డైల్ 100/112 సేవలను ఎలా వినియోగించుకోవాలో, మహిళలు మరియు బాలికల రక్షణ కోసం పనిచేసే 'షీ టీమ్స్' సేవలను వివరించారు.

**చట్టాలపై చైతన్యం :** పోక్సో చట్టం,బాల్యవివాహాల నివారణ, సైబర్ మోసాలు మరియు సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు సూచనలు చేశారు.విద్యార్థులు అడిగిన పలు సందేహాలను పోలీస్ అధికారులు చిరునవ్వుతో నివృత్తి చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తిరుమల మనోహర్‌చారి ఉపాధ్యాయులు అజ్మీరా భీక్కు నాయక్ మాట్లాడుతూ.. సమాజంలో పోలీసుల పాత్ర ఎంత కీలకమో విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజెప్పడానికి ఈ 'ఓపెన్ హౌస్' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందని,పోలీసు శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థులలో చట్టం పట్ల గౌరవాన్ని, భయాన్ని తొలగించి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి స్ఫూర్తినిచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎల్లారెడ్డిపేట సి ఐ ఓ వెంకటేష్ ఎస్సై రమేష్ పోలీస్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన గౌడ సంఘం నాయకులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట,అక్టోబర్ 23 :** మండల గౌడ సంక్షేమ సంఘం నాయకులు ఎక్సైజ్ సీఐని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పందిర్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కోల నారాయణ గౌడ్, నాయకుడు నేరెళ్ల సత్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 23 :** వీణవంక మండలంలో అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి చెక్కులు మంజూరయ్యాయి. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో, నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు చొరవతో ఈ నిధులు విడుదలయ్యాయి. మండలంలోని 19 గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 10,50,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఒడితల ప్రణవ్ బాబు గారు స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ సాహెబ్ హుస్సేన్,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, గంగాడి తిరుపతి రెడ్డి,అలె మధుసూదన్,కామిడి శ్రీపతి రెడ్డిలు పాల్గొన్నారు.

## సాంబయ్య ఆత్మకు శాంతి కలుగుగాక



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన వైనాల సాంబయ్య ఆత్మకు శాంతి కలగాలని మంథని సింగల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మాజీ ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, మరియు హనుమకొండ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ వైనాల వినోద్ లను శుక్రవారం పలువురు పరామర్శించారు. గత రెండు రోజుల క్రితం వీరి తండ్రి వైనాల సాంబయ్య మృతి చెందారు. దీంతో శుక్రవారంతో పాటు పలువురు సాంబయ్య చిత్రపటానికి మంథని మాజీ వైస్ ఎంపీపీ స్వరూప రెడ్డితోపాటు,బర్ల రాజు లడ్డు రాజు,కుంట కుమార్, అనవైన తిరుపతి,లల్లు,సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్ ఖాన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## బయో మందులతో పత్తి పంట నాశనం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి) అక్టోబర్ 23 :** బయో పురుగుమందుల పిచికారీతో పత్తి పంట పూర్తిగా దెబ్బతిందని, నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని జూలపల్లి మండలం బాలరాజుపల్లికి చెందిన రైతు కుంటూరి రాజయ్య కోరారు. శుక్రవారం పెద్దపల్లి కమాన్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ..2 ఎకరాల 20 గుంటల్లో రూ.2.50 లక్షల అప్పుతో పత్తి సాగు చేశానన్నారు. అక్టోబరు 4న జూలపల్లిలోని శ్రీ రామాంజనేయ పెస్టిసైడ్స్ దుకాణంలో ఎస్కే రెడ్డి కంపెనీకి చెందిన ప్రెసిడెంట్,వజ్రం బయో మందులు కొనుగోలు చేసి, దుకాణదారు సూచన మేరకు పిచికారీ చేయగా పంట ఎర్రబారి ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.4లక్షల దిగుబడి ఆశించిన తనకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కంపెనీ ప్రతినిధులు స్పందించడం లేదని, ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి పరిహారం అందించాలని,సంబంధిత కంపెనీ, డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని కన్నీటిపర్యంతమయ్యారు.

# కాళేశ్వరం పునరుజ్జీవం కోసం 400 కి.మీ. సైకిల్ యాత్ర

**-రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంతోనే కృత్రిమ కరువు**
**-బీఆర్ఎస్ నేతల ఆరోపణ**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి) అక్టోబర్ 23 :** కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు 400 కిలోమీటర్ల మహా సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ నేతలు బొడ్డు రవీందర్, ఉప్పు రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి కమాన్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కృత్రిమ కరువు ఏర్పడిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నా సాగునీరు అందించకపోవడం దారుణమని విమర్శించారు.

**10 నియోజకవర్గాల మీదుగా యాత్ర**

గతంలో గోదావరి నీటి సమస్యపై 180కి.మీ. పాదయాత్ర చేసినా ప్రభుత్వంలో స్పందన లేదని ఉప్పు రాజ్‌కుమార్ అన్నారు. రైతుల సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మేడిగడ్డలో ప్రారంభమయ్యే యాత్ర పది అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా సాగి కొండపోచమ్మ సాగర్ వద్ద ముగుస్తుందన్నారు. రైతులు, యువత, తెలంగాణవాదులు యాత్రకు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాశిపాక వాసు, పల్లె మధు,ముత్యం లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

**-గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్య, ఏఐ నైపుణ్యాలు**



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 23 :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైనవిద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో లిసేవా సంకల్ప అభియాన్–డిజిటల్ విద్య,కృత్రిమ మేధస్సు నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమంలిలో భాగంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో డిజిటల్ విద్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నైపుణ్యాలను పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పోషకాహారం అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యావకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ సదుపాయాల కల్పన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడం తోపాటు భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అంది పుచ్చుకునేందుకు దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పెద్దపల్లి ఎంఐఎం నూతన పట్టణ కమిటీ నియామకం

**-పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ ఉమెర్‌ను నియమించిన జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్**
**-ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ కృషి చేయాలి**
**-ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ సూచన**







**కరీంనగర్, అక్టోబర్ 23 :** ఎంఐఎం పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ ఉమెర్ ను, నూతన కమిటీని నియమించినట్లు, ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు పెద్దపల్లి పట్టణ నూతన కమిటీని శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యాలయం దారుస్సలాంలో నియామక పత్రాన్ని, నూతన కమిటీకి అందజేసినట్లు గులాం అహ్మద్ చెప్పారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. పెద్దపల్లి పట్టణంలో ఎంఐఎం పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు అలుపెరుగకుండా అహర్నిశలు పాటు పడాలన్నారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేయాలన్నారు. పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ ఉమేర్ అహ్మద్, ఉపాధ్యక్షుడుగా అడ్వకేట్ ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శిగా కలీమ్, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ ముజాహిద్, ఇర్ఫాన్ అలీ, ఖాజా మోహినుద్దీన్, షేక్ బర్కత్, కోశాధికారిగా ముఫ్తి ఇంతియాజ్ ఖాన్ అసాధి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ పర్వేజ్, ఇమ్రానోద్దీన్, ముజీబోద్దీన్, ఫుర్ఖాన్, ముజీబ్ ఖాన్, షోయబ్ ఖాన్ లను నియమించినట్లు, ఉమ్మడి జిల్లా గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు.



# జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు వంశిక ఎంపిక

## -కేటీఆర్ అభినందనలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 23 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గూడెపు వంశిక జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వంశికను ప్రత్యేకంగా అభినందించి, జాతీయ స్థాయిలోనూ అద్భుత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

**కెప్టెన్‌గా జట్టును సెమీఫైనల్‌కు చేర్చిన వంశిక...**

అక్టోబర్ 10 నుంచి 13 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వంశిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలతో కూడిన ఉమ్మడి జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఆమె, తన నాయకత్వ ప్రతిభతో జట్టును సెమీఫైనల్స్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించింది. బౌలింగ్‌లోనూ సత్తా చాటి పలువురి ప్రశంసలు అందుకుంది.

**జమ్మూ కాశ్మీర్‌లో జాతీయ స్థాయి పోటీలు...**

వచ్చే నవంబర్ మొదటి వారంలో జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో వంశిక తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదువుకుంటూ జాతీయ స్థాయికి ఎంపిక కావడం నామాపూర్ గ్రామానికి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. వంశిక విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కుంట శ్రీనివాస్‌తో పాటు ప్రోత్సాహం అందించిన పాఠశాల ఉపాధ్యాయులను పలువురు అభినందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనేందుకు వంశిక విజయం నిదర్శనంగా నిలుస్తోంది. జాతీయ స్థాయి పోటీల్లోనూ ఆమె విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# బతుకమ్మ వేడుకల్లో చైర్మన్ దంపతుల సేవా స్ఫూర్తి



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 23 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాల్లో నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల.కావ్య, వైస్ చైర్మన్ అప్పాల.గణేష్ చక్రవర్తి గురువారం రాత్రి పాల్గొని మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలకు అల్పాహారం,వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలవడంతో పాటు మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. పండుగ వేడుకల్లో పాల్గొనే మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అల్పాహారం, తాగునీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలను నింపాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో భాగంగా, వారు స్థానిక మహిళలతో కలిసి ఉత్సవాల్లో పాల్గొనడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. నిర్మల్ జిల్లాలోని తదితర ప్రాంతాల్లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పండుగ పూట సమాజంలోని ఇతరులకు అండగా నిలుస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ అందించిన సేవలను స్థానికులు అభినందించారు.

## వీడీసీ కమిటీల రద్దుకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 23 :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని పల్లె గ్రామపంచాయతీ పరిధిలో గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రెండో మహాసభలో వీడీసీ కమిటీల రద్దుకు నాయకులు డిమాండ్ చేశారు. మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ.. వీడీసీ కమిటీల పేరుతో గీత కార్మికులు, దళితులు, బడుగు బలహీన వర్గాలపై దాడులు, సాంఘిక బహిష్కరణలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం చేయకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు కోటగిరి అరుణ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో మోకుదెబ్బ జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## నిర్మల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 23 :** నిర్మల్ పట్టణంలో గురువారం రాత్రి బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల.కావ్య పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అప్పాల.కావ్య మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌరవానికి,ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ బతుకమ్మలో పలు కాలనీల మహిళలు పాల్గొని బతుకమ్మ నిమజ్జనంలో పాల్గొన్నారు.

## పరామర్శించిన డైరెక్టర్లు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజును హనుమకొండ ఏజిపి వైనాల వినోద్‌లను శ్రీ ఆదిపరహస్వామి దేవస్థానం డైరెక్టర్లు శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. ఇటీవల వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాంబయ్య కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేసి సాంబయ్య ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఆదిపరహస్వామి ఆలయ డైరెక్టర్లు పిల్లి రాజు ముదిరాజ్, భూస శ్రీనివాస్ గౌడ్,బొజ్జ సతీష్‌గౌడ్‌తోపాటు జంగా సతీష్, దండేపల్లి రవి ఉన్నారు.

## బాధితురాలికి అండగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

### -రూ. 2.25లక్షల ఎల్ఓసి మంజూరు



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 23 :** వీణవంక మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన చింతిరెడ్డి బుచ్చమ్మ అనారోగ్య చికిత్స నిమిత్తం (నిమ్స్ హాస్పిటల్) ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మానవతా దృక్పథంతో తక్షణమే స్పందించి రూ.2,25,000/-ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కి బుచ్చమ్మ కుటుంబ సభ్యులు, కుమారుడు కోమల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి : కమిషనర్



**చురకలు ప్రతినిధి,నిర్మల్,అక్టోబర్,23 :** ఈ రోజు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు,జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి బాసరలో గోదావరి నది పుష్కరాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గోదావరి పుష్కర ఘాట్లను,తదితర పుష్కరాల నిర్మాణ పనుల ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వేలాది మంది పుణ్యస్నానాలకు తరలివస్తారని,భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు అంతా ఎప్పటికప్పుడు పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అవసరమైన మేరకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తూ ఉండాలని తెలిపారు. గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు.

# ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులతో భరోసా

**-రూ.53 లక్షల విలువైన 153 చెక్కుల పంపిణీ**
**-హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 23 :** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకుంటూ, ప్రతి గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చేరవేస్తు న్నామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. హుజూరాబాద్ పట్టణం,హుజూరాబాద్ మండలంతో పాటు కమలాపూర్, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన లబ్ధిదారులకు మొత్తం రూ.53 లక్షల విలువైన 153చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రజల కు సంక్షేమ పథకాల ద్వారా మేలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్య మని,ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలవడం తమబాధ్యత అన్నారు.

**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరు సరికాదు : ప్రణవ్**

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం తప్ప స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమిటని ప్రణవ్ విమర్శించారు.ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో ముఖ్యమంత్రి ఫోటో లేకుండా చెక్కులు అందించడం కౌశిక్ రెడ్డి అవివేకానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుజురాబాద్ బిజెపిలో అసంతృప్తి

**-జిల్లా కమిటీలో స్థానిక నేతలకు దక్కని ప్రాధాన్యత**




**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**

ఇటీవల భారతీయ జనతా పార్టీ నియమించిన జిల్లా కార్యవర్గంలో హుజూరాబాద్ పట్టణ,మండల, నియోజకవర్గ నాయకులకు తగినంత చోటు దక్కలేదు.దీనిపై స్థానిక నాయకుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.ఇక్కడ కేంద్ర మంత్రి బండి సంజయ్,మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ వర్గాలు బలంగా ఉన్నాయి. గతంలో ఈటెల ఇక్కడి నుండి బిజెపి తరఫున ఒకసారి ఎమ్మెల్యేగా కూడా ప్రాతినిత్యం వహించారు. అయినప్పటికీ..అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్ళ మాత్రమే సమయం ఉన్న ప్రస్తుత తరుణంలో.. పార్టీ బలోపేతానికి ఇక్కడి నాయకులకు జిల్లా కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంది. అయితే అనూహ్యమైన రీతిలో ఇక్కడి నాయకులకు తగిన ప్రాధాన్యం లభించలేదు. హుజూరాబాద్ కు చెందిన నాయకులను జిల్లా కమిటీకి ఎందుకు దూరంగా ఉంచారు? కావాలనే పక్కన పెట్టారా? లేక వర్గ పోరు మళ్ళీ తెరపైకి వస్తుందని ఉద్దేశంతో పెట్టారా? అన్న చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.ఒకవైపు నియోజకవర్గంలో .. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ బలంగా తమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వారిని ఎదుర్కొనే రీతిలో బిజెపి కార్యక్రమాలు మాత్రం జరగడం లేదని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. హుజూరాబాద్ జమ్మికుంట పట్టణాల్లో మండలాల్లో, అలాగే ఇతర మండలాల్లో




జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి తన సత్తాను చాటినప్పటికీ అధిష్టానం పట్టించు కోకపోవడంపై బీజేపీ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.ఇలాగైతే భవిష్యత్తులో పార్టీ గడ్డ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. హుజూరాబాద్ కు ప్రతినిత్యం దక్కకపోవడంపై సోషల్ మీడియాలో పలువురు కార్యకర్తలు బహిరంగంగా తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధిష్టానం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

## ఉమ్మడి జిల్లా ఎంఐఎం అధ్యక్షుడు గులాం అహ్మద్‌ను

# సన్మానించిన మాజీ కౌన్సిలర్ సాబెర్ అలీ



**కోరుట్ల, అక్టోబర్ 23 :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియామకం పొందిన సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ను, ఎంఐఎం మాజీ కౌన్సిలర్, మాజీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ సాబెర్ అలీ, కరీంనగర్ దారుస్సలాంలో ఆత్మీయంగా సన్మానించారు. ఈసందర్భంగా సాబెర్ అలీ మాట్లాడుతూ..గులాం అహ్మద్ హుస్సేన్ కు, జగిత్యాల జిల్లా బాధ్యతలు కూడా అప్పగించాలని, ఎంఐఎం అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ కి విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నగర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎంఐఎం పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు గులాం అహ్మద్ అలుపెరుగకుండా అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మైనారిటీ ప్రజల సమస్యలను పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తూ, వాటి పరిష్కారానికి అనునిత్యం, రాత్రి పగలు తేడా లేకుండా సేవలు అందించారని చెప్పారు. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడం, మైనారిటీ వర్గాల సంక్షేమానికి పాటుపడటం, అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడం అయన ప్రత్యేకతలని అన్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ, ముస్లిం సమాజ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్న గులాం అహ్మద్ కు, అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రమోషన్ ఇచ్చి మూడు జిల్లాల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సంతోషకరమని పేర్కొన్నారు. గులాం అహ్మద్ భవిష్యత్తులో అయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నాయకులు జాకీర్ అలీ, మాజీ మజహర్ సులేమాన్, చాంద్ పాషా, జహీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి రీ సర్వేపై ప్రజలకు అవగాహన



**-భూ రీ సర్వే నియమ నిబంధనలను వివరించిన అధికారులు**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 23 :** భూ భారతి కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న భూ రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు భూ భారతి రీ సర్వేకు సంబంధించిన విధివిధానాలు, నియమ నిబంధనలు, ప్రజలు తెలుసుకోవాల్సిన అంశాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఏడీ కిషన్‌రావు, హుజూరాబాద్ ఆర్డీవో జలకుమారి మాట్లాడుతూ భూ భారతి రీసర్వేకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలు, రికార్డుల ప్రాముఖ్యత, సర్వే ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రీ సర్వే ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జలకుమారి, ఏడీ కిషన్‌రావు, డీఐ వెంకటరత్నం, తహసీల్దార్ నరేందర్, తుమ్మనపల్లి గ్రామ సర్పంచ్ అన్నాడి మాధవి, మాందాడిపల్లి గ్రామ సర్పంచ్ వేల్పుల విజయ, పంచాయతీ కార్యదర్శి బుర్ర విజయ్‌కుమార్, జీపీఓ నేరెళ్ల అనూష, గ్రామ కారోబార్ పొద్దుటూరి మధుకర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల

# సంస్మరణ వారోత్సవాలు



**-సవరన్ మసీదులో సీపీ గౌష్ ఆలం ప్రత్యేక ప్రార్థనలు**
**-పోలీసు శాఖ సంక్షేమం కోసం ప్రత్యేక దువా**
**-హాజరైన ఏసీపీలు, పోలీస్ అధికారులు**

**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్,అక్టోబర్ 23 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక సవరన్ మసీదులో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.సమాజ రక్షణ కోసం, శాంతిభద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు.అలాగే పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది క్షేమం, ప్రజా సంక్షేమం కోరుతూ ప్రత్యేక దువా నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ సమాజ శాంతి కోసం అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీతో పాటు ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, విజయకుమార్, టౌన్ , ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

